క్లుప్తంగా

వైభవంగా కల్యాణ మహోత్సవం


రాయుడుపాలెంలో స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

వేంసూరు: మండల పరిధిలోని రాయుడు పాలెంలో కొలువుదీరాయున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

22 నుంచి బ్రహ్మోత్సవాలు

ముదిగొండ: మండలపరిధిలోని యడవల్లి, ముదిగొండ గ్రామాల్లో ఈ నెల 22నుంచి శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి, ముదిగొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు కల్యాణ క్రతువు నిర్వహించనున్నట్లు అర్చకులు నరసింహాచార్యులు, రొంపిచర్ల యగ్నేష్‌లు తెలిపారు.

వైరాలో దైవ సేవకుల సమావేశం


మాట్లాడుతున్న ఫెలోషిప్ అధ్యక్షుడు స్టీవెన్

వైరా: వైరా పాస్టర్స్, ఇవాంజలిస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరమ్మ కాలనీలో పాస్టర్ తేళ్లూరి మార్క్ ఇంటి వద్ద సోమవారం దైవ సేవకుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. ఫెలోషిప్ నిరుపేద సేవకుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదన్నారు. క్రైస్తవులు అంతా ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. క్రైస్తవులకు ప్రత్యేకంగా శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు బి.స్టీవెన్, ఉపాధ్యక్షుడు మోదుగు వినోద్, కార్యదర్శి సురేష్, ట్రెజరర్ రూపస్ బాబు, అజరయ్య, సుధాకర్, స్టీవెన్, ఇశ్రాయేల్, కోర్నెలి, భాస్కర్, సైమస్ తదితరులు పాల్గొన్నారు

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు


విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలికలను ఖమ్మం హుందాయ్ షోరూం అధినేత కేసా సుభాష్ చంద్రబోస్ ఆయన భార్య శారద, కుమారుడు శ్రీకాంత్‌లు నగదు పురస్కారాలు అందించారు. పాఠశాలకు చెందిన రాయల స్రవంతి 9.2 జీపీఏతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినందుకు గాను రూ.30 వేలు, పాఠశాల స్థాయిలో అధిక మార్కులు సాధించిన గుండ్ల నిఖిత, మర్రి వర్షిణీలకు రూ.12,500 చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ ఎండీ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దానియేలు, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్క్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

వైరా: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన బీఆర్క్ 2024 ఫలితాల్లో వైరా న్యూ లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన కుర్రా స్వాత్య ఆల్‌ఇండియా 1,247వ ర్యాంకు సాధించగా.. నందిగామ విక్రంత్ 3,350, చావా సాయి సుధీర్ 4,095, వడ్డె శ్రీముఖి 10,862వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యు, ఏఓ నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ రైల్వేకాలనీ గ్రామానికి చెందిన కోపూరి నాగార్జున్ (30) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గొర్రెలు, మేకల ఎరువుతో..

నేలకు జీవం

- భూసారం పెరిగేలా దోహదం
- అధిక దిగుబడులు వస్తాయంటున్న వ్యవసాయ అధికారులు


ఎరువు కోసం గొర్రెలు, మేకలను పొలంలో ఉంచిన దృశ్యం

బోనకల్: భూమిలో నేల సారాన్ని పెంచడంలో గొర్రెలు, మేకల ఎరువులకు అధిక ప్రాధాన్యత ఉంది. ఈ ఎరువు విక్రయం రైతులకు మెరుగైన రాబడులను తెచ్చి పెడుతుంది. రసాయన వ్యవసాయంలో తినే తిండి మాత్రమే కాదు, భూసారం కూడా పాడవుతుంది. దీనికి రసాయన రహిత వ్యవసాయం ఒక్కటే పరిష్కార మార్గం. ఈ సమస్యలు గొర్రెల, మేకల ఎరువు, కోళ్ల ఎరువు, కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, సేంద్రియ ఎరువు భూసారాన్ని పెంచడానికి ఉపయోగపడతాయి. నీటి వసతి ఉన్న భూములే కాదు, వర్షాధారిత పంట భూముల్లో సేంద్రియ పదార్థం ఎంత ఎక్కువ వేస్తే అంత మంచిది. వ్యవసాయ క్షేత్రంలో మూగజీవాలను వదిలితే అవి విసర్జించే పేడ, మూత్రం ద్వారా సేంద్రీయ పదార్థం లభిస్తుంది. ఈ గొర్రెల పేడలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. దీంతో మొక్క వేర్లు ఈ పేడ చుట్టూ చొచ్చుకు పోతాయి. పేడలో ఉపయోగకర సూక్ష్మజీవులు ఉండి జీవన ఎరువుగా పనిచేస్తుంది.

గొర్రెలు, మేకల మూత్రంతో భూమికి కలిగే ఉపయోగాలు..

- గొర్రెలు, మేకల మూత్రం పీహెచ్ విలువ 7.7 ఉంటుంది. కాబట్టి చౌడు భూములు సైతం సారవంతంగా మారతాయి.
- లీటరు మూత్రంలో 3నుంచి 13 గ్రాముల నత్రజని 18నుంచి 20 గ్రాముల పొటాషియం, పాస్పరస్ మొదలైన మూలకాలు ఉంటాయి.
- ఒక గొర్రె ఒక రాత్రికి ఒక లీటరు మూత్రం విసర్జిస్తుంది. దాంతో పాటు పేడ వేయడం వలన భూమిలో కలిసిపోతుంది. తద్వారా భూమి మట్టిలో కొంత భాగాన్ని ఆక్రమిస్తుంది. భూమి గుల్లబారుతుంది. ఈ ఎరువు భూమిలో కలవాలంటే కొంత కాలం పడుతుంది.
- ఒకరోజు గొర్రె 360నుంచి 540గ్రాములు, మేక 900గ్రాముల వరకు పేడను విసర్జిస్తుంది. తద్వారా 0.5 నుంచి 0.7 వరకు నత్రజని, 0.4 నుంచి 0.6 భాస్వరం, 0.1 నుంచి 0.3 వరకు పోటాష్ లభ్యమవుతుంది.
- గొర్రెలు, మేకల పేడలో బ్యాక్టీరియాలు, ప్రోటోజోవా, ఫంగీ మొదలైన ఉపయోగకరమైన సూక్ష్మ జీవుల వలన భూమిలో పేడ పులిసి ఎరువుగా మారుటకు, పంట తీసిన తరువాత వ్యవసాయ ఉప ఉత్పత్తులైన చొప్పగడ్డి, కలుపు జీవరాశులు చనిపోతాయి. నేల బండబారి, నీటిని నిలుపుకునే శక్తిని కలిగి ఉంటుంది. పోషకాలు సమతుల్యంగా లభ్యమౌతాయి. భూమిలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు లభ్యమవుతాయి.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం..



సేంద్రియ వ్యవసాయం రైతులకు లాభదాయకం. పశువులు, గొర్రెల ఎరువును పొలంలో వేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. రైతులు ప్రతి ఏటా జీవాల పెంటను వేయించడం ద్వారా భూమి సమతుల్యతను కాపాడుతుంది. భూమికి తడులను తట్టుకునే శక్తి ఉంటుంది.

– ఎస్ సరిత,
మండల వ్యవసాయాధికారి, బోనకల్

అధిక దిగుబడి వస్తుంది..



గొర్రెలు, మేకల ఎరువును పెట్టించడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రతి ఏటా పొలంలో గొర్రెలు, మేకల మందను కూర్చోబెట్టడం ద్వారా రసాయన ఎరువులు తక్కువగా పడుతున్నాయి. పంట కూడా అధిక దిగుబడి వస్తుంది. ప్రతి ఏటా పంట పూర్తి అయిన తరువాత నెల రోజుల పాటు గొర్రెలను పొలంలో ఉండే విధంగా చూసుకుంటాను. 5ఎకరాలకు గాను 10వేల రూపాయిల ఖర్చు వస్తుంది.

– బందం వెంకటేశ్వర్లు, రైతు, ముష్టికుంట్ల

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు


పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ప్రారంభిస్తున్న ఏఓ ఉమామహేశ్వరరెడ్డి

కారేపల్లి: మండలంలోని రైతులకు 60శాతం సబ్సిడీపై పిచ్చిరొట్ట విత్తనాలు అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం కారేపల్లి సొసైటీ కార్యాలయంలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కారేపల్లి సొసైటీలో 800ల పచ్చిరొట్ట బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, రైతులు తమకు సంబంధించిన పట్టాదారుపాసుపుస్తకం జిరాక్స్‌తో మండల వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సందర్శించి కూపన్ పొందగలరని సూచించారు. కూపన్ ద్వారా సంతగుడి వద్ద ఉన్న పాత సొసైటీ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 91772 36912 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బొల్లు హన్మంతరావు, సిబ్బంది ముండ్ల సురేష్, ఉండం సాంబశివరావు, దమ్మాలపాటి నాగేశ్వరరావు, యాకూబ్‌పాష, రైతులు ధారావత్ రాము, బానోత్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లు ప్రారంభమైన నేపథ్యంలో కళాశాలలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మాధవరపు అశోక్ బాబు, కార్యదర్శి పాగి బాలస్వామి మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి కళాశాలలో సైన్స్ సెక్షన్లలో కూడా బోధన ఉంటుందని.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏఎల్‌ఎన్ శాస్త్రి మాట్లాడుతూ.. కళాశాలలో మౌలిక వసతులు ఉన్నాయని, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా బోధన ఉంటుందన్నారు. అడ్మిషన్ల ప్రచారం కోసం అశోక్ బాబు రూ.5 వేలు వితరణగా అందజేశారు. కళాశాలకు నూతనంగా రంగులు వేయడం, కళాశాలలో సైన్స్ సెక్షన్లకు బోధనా సిబ్బందిని మంజూరు చేయించడం , నూతన భవన నిర్మాణం, ల్యాబ్ లు నిర్మాణం కోసం తప్పనిసరిగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, అర్థశాస్త్ర అధ్యాపకురాలు అరుణ, తెలుగు అధ్యాపకురాలు ఇందిర, హిస్టరీ అధ్యాపకులు వీరన్న, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనలో కేంద్రం విఫలం


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వైరా: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. వైరా అమరవీరుల నగర్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా సోమవారం ఆయన మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి రావడానికి బీజేపీ, మిత్ర పక్షాలు దిగజారి మాట్లాడుతున్నాయన్నారు. కేవలం రాముడిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం వారి మత జాడ్యానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగంలో పౌరులకు కలపించిన హక్కులను మారుస్తామని బహిరంగంగానే చెప్పడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. పౌర హక్కులను కాపాడుకోవడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను ఓడించాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల అర్జునరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ రామచందర్, నాయకులు గుర్రం అచ్చయ్య, అశోక్, జి రామయ్య, వెంకయ్య, వెంకటరెడ్డి, యలదండి బాబు, లలిత, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న రవికుమార్

మధిర: ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యూత్ కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షుడు అద్దంకి రవికుమార్ తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పట్టభద్రులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి గ్రామాల్లో ప్రచారం చేసి తీన్మార్ మల్లన్నకు ఓట్లు వేసే విధంగా యూత్ కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బుచ్చిరామయ్య, వంశీకృష్ణ, సతీష్, రాంబాబు, నాగరాజు, వంశీ, డేవిడ్, పాషా, గోవింద్, జానీ, లక్ష్మారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేకులను సస్పెండ్ చేయాలి


సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

కారేపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేకులను సస్పెండ్ చేయాలని మాజీ దిశకమిటీ సభ్యులు లకావత్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ గుగులోతు సక్రు తెలిపారు. సోమవారం కారేపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోవర్టుగా తాతా మధు పని చే స్తున్నాడని, గత అసెంబ్లీ ఎన్నికల్లో తాతా మధు తీరుతోనే వైరాలో బీఆర్‌ఎస్ ఓటమిపాలైందన్నారు. తక్షణమే ఆయనను అధ్యక్ష పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కోటేశ్వరరావు, జుంకీలాల్, కోటేశ్వరరావు, వికాస్, మధు, మురళి పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న శంకరాచారి

మధిర: మధిర పట్టణంలోని శ్రీ విష్ణేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. పులిగడ్డ నాగేశ్వరరావు, ఆదిలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కుమార్తె, అల్లుడు రాయపురెడ్డి వెంకట సాయి కిరణ్, శ్రావ్య దంపతుల ఆర్థిక సాయంతో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి ప్రారంభించారు.

బీమా చెక్కు అందజేత

కల్లూరు: పోస్ట్ ఆఫీస్‌లో ప్రతి ఒక్కరూ బీమా పాలసీ తీసుకుని కుటుంబానికి భరోసా కల్పించాలని సత్తుపల్లి సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని శాంతినగర్‌కు చెందిన ధనమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆమెకు మంజూరైన ఇన్సూరెన్స్ నగదును నామిని అయిన ఆమె కుమారుడికి రూ.10లక్షలు ఎస్సై అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధనమ్మ పోస్ట్ ఆఫీసులో రూ.399తో టాటా పాలసీ ప్రమాద బీమా తీసుకోవడం జరిగిందని తెలిపారు. పోస్టాఫీస్ నందు ప్రస్తుతం రూ.520లతో రూ.10లక్షల ఇన్సూరెన్స్, అదే విధంగా రూ.720లతో రూ.15లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్కినేని రఘు, ఎస్‌పీఎం రామకృష్ణ, రాజా, రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో కరెంట్ కట్

కల్లూరురూరల్: మండలంలోని 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో కలిగిన అంతరాయం కారణంగా విద్యుత్ సమస్య ఏర్పడింది. టేకులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య ఏర్పడి ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో కల్లూరు, పెనుబల్లి మండలాల్లో గత రెండురోజులుగా తీవ్ర విద్యుత్ సమస్య ఏర్పడింది. కల్లూరు మండలానికి టేకులపల్లిలో ఏర్పాటు చేసిన 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ సబ్‌స్టేషన్‌లోనే సాంకేతిక సమస్య ఏర్పడటంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు గాను తాత్కాలికంగా తల్లాడ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌ను కల్లూరు మండలానికి సరఫరా చేస్తున్నారు. టేకులపల్లిలో ఏర్పడిన సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు ఇంజనీర్లు కృషి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని హనుమాన్ టెంపుల్, ఎన్టీఆర్ కాలనీ ఏరియాల్లో రెండు 100కేవీ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నందున నేడు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని మండల విద్యుత్ ఏఈ జి.అనూష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కుర్నవల్లి, మిట్టపల్లి సబ్‌స్టేషన్ల పరిదిలో..

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు విద్యుత్ సరఫరా బంద్ చేయనున్నట్లు విద్యుత్ ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు. కుర్నవల్లి, మిట్టపల్లి సబ్‌స్టేషన్ల పరిదిలోని కుర్నవల్లి, ముద్దునూరు, కలకొడిమ, రంగాపురం, కేశ్వాపురం, పుణ్యపురం, బస్వాపురం , మిట్టపల్లి, పినపాక, వెంకటాపురం, రామానుజవరం, లక్ష్మీపురం, నారయ్యబంజర, నూతనకల్, వెంగన్నపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏబీపీపీ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా రజనీకాంత్


ఏబీపీపీ సభలో పాల్గొన్న ఎన్నికల అధికారులు

కల్లూరు: ఖమ్మం గోపాలపురంలో అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ(ఏబీపీపీ) కార్యాలయంలో ఎన్నికలను సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా తమిళనాడు నుంచి పాండవన్ వెంకటేషన్, రాష్ట్ర కోశాధికారిగా పరిశీలకుడు బండి కట్ల శ్రీనివాసాచార్యులు సభకు ముఖ్య అతిథులుగా వ్యవహరించారు. ఇందులో భాగంగా ఏబీపీపీ కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కల్లూరు పట్టణానికి చెందిన కాటేపల్లి రజనీకాంత్ రెండోసారి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి రెండోసారి అవకాశం కల్పించిన జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఏబీపీపీ కార్యదర్శి చిర్రా రవిని కోశాధికారిగా ఎన్నుకోవడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నుంచి 8 బ్రాంచ్‌ల సంఘం సభ్యులు, జాతీయ పీఆర్ఓ గంగిశెట్టి రాజా, రాష్ట్ర కార్యదర్శి టీవీ పుల్లంరాజు, జోనల్ కార్యదర్శి ఇస్లావత్ నగేష్, సభ్యులు కల్లూరు వాసులు మల్లాది బసవయ్య, సత్యం, ఆళ్ల వెంకటేశ్వరరావు, అప్పలనాయుడు, బ్రాంచ్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి


మధిర: ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


వైరా: మాట్లాడుతున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

మధిర/వైరా/తల్లాడ/ఎర్రుపాలెం: ఈ నెల 27న జరిగే ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజాయితీగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవకి వాసుదేవరావు అన్నారు. సోమవారం మధిర కోర్టులో న్యాయవాదులను, బ్యాంకు ఉద్యోగులను, ఎల్ఐసీ, పోస్టల్ ఉద్యోగులను, విద్యాసంస్థల ప్రతినిధులను, వ్యాపార వర్గాలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అదే విధంగా వైరాలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ ధర్మారావు, తల్లాడలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చల్లా నాగులు, మండల అధ్యక్షులు వెంకటరామారావు, భద్రరాజు మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలపై గొంతుక వినిపించే ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ.. ఎర్రుపాలెం మండలంలోని భీమవరం, గుంటుపల్లిగోపవరం, మాముసూరు, బనిగండ్లపాడు, ఎర్రుపాలెం తదితర గ్రామాల్లో మధిర అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నూతక్కి నర్సింహారావులు, నాయకులు ప్రచారం నిర్వహించి ఊరూరా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్యాం రాథోడ్, రుక్మారావు, నాగేశ్వరరావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, నెల్లూరి కోటేశ్వరరావు, భద్రయ్య, కార్తీక్, గోపాలకృష్ణ, నరేష్, మహిళా నాయకురాలు స్వర్ణకుమారి, విజయరాజు, సాంబశివరావు, రమేష్, చంద్రశేఖర్ రెడ్డి, కోటేశ్వరరావు, సుమంత్, మోహన్ రావు, దినకర్, శ్రీహరి, పురుషోత్తం, రవికుమార్, చౌడా నాగేశ్వరరావు, కిరణ్, నరేష్, కృష్ణ, సాయిచందు, నాగరాజు, అశోక్, జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు, ఎస్సీ మోర్చా మండల కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు కృష్ణారావు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి


సమావేశంలో మాట్లాడుతున్న యర్రయ్య

ఏన్కూరు: బీజేపీని ఓడించాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య కోరారు. సోమవారం లచ్చగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామీణ పేదల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి నిరోధక అంతరంగిక విదేశాంగ విధానాలను అనుసరిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణపేదల సంఘం నాయకులు కల్తి రాంచంద్రయ్య, షేక్.సాంద్ మియా, జక్కం శ్రీను, కల్తి లెనిన్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?

- ఎన్నెస్పీ కెనాల్స్‌పై ప్రమాదకరంగా కల్వర్టులు
- వాహనచోదకుల తీవ్ర ఇబ్బందులు
- మరమ్మతుల ఊసెత్తని అధికారులు


నర్సింహాపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం, జమలాపురం, కేశిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో నాగార్జున సాగర్ కాల్వలపై రోడ్డు కల్వర్టులను ప్రభుత్వం నిర్మించింది. ఈ రోడ్డు కల్వర్టులు పూర్తిగా శిథిలమయ్యాయి. ఇవి దశాబ్దాలుగా దర్శనమిస్తున్నప్పటికీ పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ రోడ్లపై వాహనాలు నిత్యం సంచరిస్తూ ఉంటాయి. కల్వర్టుల వద్ద ప్రయాణం.. భద్రత లేకుండా ఉంది.

ప్రధాన రహదారులపై శిథిలమైన కల్వర్టులు..

బనిగండ్లపాడు–రాజుపాలెం ప్రధాన రహదారిపై నర్సింహాపురం గ్రామానికి సమీపంలో ఎన్నెస్పీ కెనాల్‌పై దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. రెండు వైపులా రెయిలింగ్‌లు పూర్తిగా విరిగిపోయింది. దీనిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనాలు అదుపు తప్పితే ఇక అంతే సంగతులు. అదే విధంగా జమలాపురం టూ వెంకటాపురం రోడ్డులో, రేమిడిచర్ల నుంచి జమలాపురం గ్రామం వెళ్లే రోడ్డులో, ఎర్రుపాలెం నుంచి కేశిరెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిలో, గట్లగొరారం నుంచి సత్యనారాయణపురం రహదారిలో.. సాగర్ కాల్వలపై నిర్మించిన వంతెనలు పూర్తిగా శిథిలమయ్యాయి. ఎంటువంటి ప్రమాదాలు జరగకముందే పాలకులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



నర్సింహాపురం వద్ద కల్వర్టు, రేమిడిచర్ల–జమలాపురం గ్రామాల మధ్యలోని కల్వర్టుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే ఉన్నతాధికారులకు నిధుల మంజూరీ ప్రతిపాదనలు పంపిస్తాం.

– సాంబశివరావు, ఎన్ఎస్‌పీ డీఈ, ఎర్రుపాలెం

అధికారులు స్పందించాలి..



కల్వర్టుల వద్ద మరమ్మతులకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరి చేయాలి. శిథిలమై దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ ఇంకెన్నాళ్లకు మరమ్మతులు చేస్తారు. కల్వర్టుల వద్ద ప్రయాణం భయంగా ఉంది.

– కొమ్మూరి గోపాలరావు,
మాజీ సర్పంచ్, రామాపురం

నిధులు మంజూరు చేయాలి..



బనిగండ్లపాడు నుంచి రాజుపాలెం ప్రధాన రోడ్డులో సాగర్ కాల్వపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. పలు మార్లు ఫిర్యాదులు చేశాం. ఇక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తుంది.

– లావు వెంకటేశ్వరరావు, రైతు, నర్సింహాపురం